సాక్షి అనంతపురం

ఆదివారం । 18 । మే । 2025



టన్ను చీనీ రూ.37 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.37 వేలు, కనిష్టంగా రూ.5 వేల ప్రకారం ధర పలికాయి.



ఆర్డీటీని కాపాడుకుందాం

కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన 'సేవ్ ఆర్డీటీ' బైకు ర్యాలీకి విశేష స్పందన లభించింది.

8లో

గరిష్టం/కనిష్టం

37.2°/22.3°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సునీత సోదరుడు మురళీ ప్రోద్బలంతోనే హత్యలు

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రాప్తాడురూరల్: రాప్తాడు మండలంలో శనివారం జరిగిన దంపతుల హత్య ఘటనపై మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ముమ్మాటికీ ఆ హత్యలు పరిటాల సునీత సోదరుడు ధర్మవరపు మురళీ ప్రోద్బలంతోనే జరిగాయని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. ఆయన మాటల్లోనే... 'గత ఏడాదికాలంగా జిల్లాలో జరుగుతున్న దాడులు, హత్యలు, దుర్మార్గాలు, దోపిడీలు అందరూ చూస్తూనే ఉన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో కురుబ లింగమయ్య హత్య జరిగి నెలకూడా కాకుండానే ఈరోజు రాప్తాడులో చిగిచెర్ల నారాయణరెడ్డి, ఆయన సతీమణి ఇద్దరినీ భూ తగాదా విషయంలో హత మార్చారు. అధికార పార్టీకి చెందిన మండల ముఖ్య నేతలు, మండల టీడీపీ ఇన్‌చార్జ్ ప్రోత్సాహంతోనే ఈ హత్యలు జరిగాయి. 15 మంది వేట కొడవళ్లతో నారాయణరెడ్డి దంపతులను హత్య చేసి నారాయణరెడ్డి బావమరిదిపైనా దాడి చేశారు. తీవ్ర గాయాలతో ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనలో మృతుల కుమారుడు ప్రత్యక్షసాక్షిగా ఉన్నాడు. హైకోర్టులో వివాదం ఉన్న భూమిని మురళీ ప్రోద్బలంతో కొందరు టీడీపీ నాయకులు రూ. 4 కోట్లకు అగ్రిమెంట్ చేసుకున్నారు. దాదాపు రూ. 20 కోట్లకు పైగా ఈ భూమి విలువ చేస్తుంది. కోర్టులో ఉన్న ఈ భూమిని పంపు కొండప్ప, మరికొందరు భాగస్తులను ఆన్‌లైన్ వన్–బీ అడంగల్, వెబ్‌ల్యాండ్‌లో చేర్చడం ఎంతవరకు సమంజసం. ఆర్డీఓ, తహసీల్దార్ చేసిన దుర్మార్గపు చర్య వల్ల ఈరోజు నిండు ప్రాణాలు బలయ్యాయి. పరిటాల సునీతమ్మ...సంపాదన కోసం ఖూనీలు కూడా చేయిస్తున్నావా? ఇలాంటి వారిని ప్రోత్సహిస్తే పార్టీ పరువు మరింత బజారున పడుతుందనే విషయాన్ని చంద్రబాబు గ్రహించాలి. జిల్లా ఎస్పీ కార్యాలయానికి 8 కిలోమీటర్ల దూరంలోనే రెండు హత్యలు జరిగాయి. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇందులో కుట్రదారులుగా మేము భావిస్తున్న ధర్మవరపు మురళీపైనా కేసు నమోదు చేస్తేనే ఇలాంటి ఘటనలు పునరావృతం కావు. గతంలోనూ మురళీ కనుసన్నల్లోనే వైఎస్సార్‌సీపీ నాయకుడు శివప్రసాద్ రెడ్డిని తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి హత్య చేయించారు. మళ్లీ అలాంటి పరిస్థితులే పునరావృతం అవుతున్నాయి' అని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికైనా దయచేసి కళ్లు తెరవాలని సీఎం చంద్రబాబు, డీజీపీ, ఎస్పీని ఆయన కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉందన్నారు. వర్షాలకు పాత భవనాలు, మట్టి మిద్దెలు కూలిపోయే ప్రమాదం ఉన్నందున ఖాళీ చేసి సురక్షిత ప్రాంతంలో ఉండాలన్నారు. తడకలేరు, పండమేరు, పెన్నా, హగరి (వేదవతి), చిత్రావతి, కూతలేరు, ఉప్పువంక తదితర నదులు, వాగులు, వంకల పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాలో 146 చెరువులు ఉండగా, ఇటీవల కురిసిన వర్షాలకు 20 చెరువుల్లో పూర్తిస్థాయి నీరుందని, మరో 25 చెరువుల్లో 75 శాతం, 43 చెరువుల్లో 50 శాతం, 63 చెరువుల్లో 25 శాతం నీరు చేరిందన్నారు. వర్షాలు కురిస్తే ఇప్పటికే నిండుగా ఉన్న చెరువులు పొంగిపొర్లే ప్రమాదం ఉందన్నారు. ఈ క్రమంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పలు చోట్ల పిడుగులు పడే అవకాశముందని, బహిరంగ ప్రదేశాలు, చెట్లు, టవర్లు తదితర చోట్ల ఉండరాదని సూచించారు.



వేలాది మంది భక్త జనం నడుమ సాగుతున్న నృసింహుని రథోత్సవం(ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకరణలో స్వామివారి మూలవిరాట్

నమో నారసింహ

పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి బ్రహ్మ రథోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. 'లక్ష్మీనారసింహా గోవిందా.. గోవిందా' అంటూ స్వామి వారి బ్రహ్మరథాన్ని భక్తులు ముందుకు లాగుతూ పులకించిపోయారు. స్వామి వారికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం వద్ద సాయంత్రం ధూళోత్సవం వేలాది మంది భక్తుల నడుమ ఘనంగా జరిగింది.

– ఉరవకొండ/ ఉరవకొండ రూరల్:



జనవాహిని నడుమ సాగుతున్న శ్రీవారి రథోత్సవం,(ఇన్‌సెట్)శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరుడు

భక్తజన వరద గోవిందా..

'భక్తజన వరదా .. వెంకటేశ్వరా నమోస్తుతే' అంటూ రాయదుర్గం పట్టణం పులకించింది. పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వెంకటరమణుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం బ్రహ్మరథోత్సవం కమనీయంగా సాగింది.రథం సాగుతున్నంత సేపూ భక్తులు ఆధ్యాత్మిక సాగరంలో మునిగితేలారు.

– రాయదుర్గం:

- సందడిగా జేఎన్‌టీయూ (ఏ) 14వ స్నాతకోత్సవం
- చాన్స్‌లర్ హోదాలో హాజరైన గవర్నర్ జస్టిస్ నజీర్
- డాక్టర్ చావా సత్యనారాయణకు గౌరవ డాక్టరేట్ ప్రదానం
- విద్యార్థులకు బంగారు పతకాల బహూకరణ

విశ్వమంత సంబరం

లక్ష్యం వైపు దృష్టి నిలిపారు. ఆత్మవిశ్వాసం, కృషితో 'బంగారు' కలను నెరవేర్చుకున్నారు. గవర్నర్ చేతుల మీదుగా పతకాలనందుకుని కేరింతలు కొట్టారు. తల్లిదండ్రులకు సంతోషం పంచారు. సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. అతిథుల స్ఫూర్తివంతమైన మాటలను విని ఉప్పొంగారు. రాయలసీమకే తలమానికంగా నిలిచిన అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ 14వ స్నాతకోత్సవ సంబరం అంబరమంటింది.



స్నాతకోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సింధూర, తదితరులు





పతకాలు అందుకున్న సంతోషంలో..



జేఎన్‌టీయూ వీసీ, రిజిస్ట్రార్, పాలకమండలి సభ్యులతో చాన్స్‌లర్/ గవర్నర్ అబ్దుల్ నజీర్, గౌరవ డాక్టరేట్ గ్రహీత చావా సత్యనారాయణ



స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, తదితరులు

అనంతపురం: జేఎన్‌టీయూ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన స్నాతకోత్సవానికి చాన్స్‌లర్ హోదాలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. గౌరవ డాక్టరేట్ గ్రహీత డాక్టర్ చావా సత్యనారాయణ, వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు, ముఖ్య అతిథి, కాన్పూర్ ఐఐటీ ఎమిరటస్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఆర్. మాధవ్, పాలక మండలి సభ్యులు, డీన్లు వేదికపై ఆశీనులయ్యారు. చాన్స్‌లర్ హోదాలో ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగం ఆద్యంతమూ విద్యార్థులు చప్పట్లతో హోరెత్తించారు. ప్రసంగం ప్రారంభంలో 'జేఎన్‌టీయూ విద్యార్థులు బంగారు బిడ్డలు' అంటూ గవర్నర్ అనడం ఆకట్టుకుంది. డాక్టర్ చావా సత్యనారాయణకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం ద్వారా వర్సిటీ కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరింది.

సందడే.. సందడి

స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని పీజీ, పీహెచ్‌డీ, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. మొత్తం 41 బంగారు పతకాలు ఇవ్వగా, 27 బంగారు పతకాలు అమ్మాయిలే సాధించడం గమనార్హం. ఈ సందర్భంగా విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. 'బంగారు' క్షణాలను సెల్ఫీలు తీసుకుని పదిలపరచుకున్నారు.విద్యార్థుల తల్లిదండ్రులు, వారి బంధువులతో వర్సిటీలో సందడి వాతావరణం నెలకొంది. పతకాలు పొందిన బిడ్డలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు.

దక్షిణాదిలోనే ఘనత..

జేఎన్‌టీయూ (ఏ) వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు స్నాతకోత్సవాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. వర్సిటీ సాధించిన ప్రగతిని వివరించారు. ఏకంగా 90 వేల మంది వర్సిటీ విద్యార్థులు నైపుణ్య కోర్సులను పూర్తి చేశారని, దక్షిణ భారతదేశంలోనే ఈ ఘనత సాధించిన తొలి వర్సిటీగా జేఎన్‌టీయూ ఖ్యాతి దక్కించుకుందన్నారు. 'ద టైమ్స్ ఇండియా వరల్డ్ ర్యాంకింగ్'లో 801–1,000 ర్యాంకు దక్కించుకుందన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సుల్లో మైనర్ డిగ్రీని ప్రవేశపెట్టామని,అపార్ అనుసంధానంతో అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. రూ.22 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టామన్నారు. గేట్ – 2024లో జాతీయ స్థాయిలో 25 ర్యాంకులు వచ్చాయని, జాతీయ స్థాయిలో పి. హేమంత్ రెడ్డి ఏడో ర్యాంకు,కే. జ్ఞానేశ్వర రెడ్డి 144వ ర్యాంకు సాధించి వర్సిటీ కీర్తిని ఇనుమడింపజేశారన్నారు. మొత్తం 33 పేటెంట్లు, 354 జర్నల్స్, 72 పుస్తకాలు, 1,500 పేపర్లు పబ్లిష్ చేసినట్లు పేర్కొన్నారు. 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్'లో వర్సిటీ భాగస్వామి కావడం గర్వకారణమన్నారు.

గవర్నర్ ప్రశంస..

స్నాతకోత్సవ నిర్వహణపై గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులందరూ మంచి క్రమశిక్షణతో ఉన్నారంటూ ప్రశంసలు గుప్పించారు. ఇంతటి చక్కటి వాతావరణంలో సాగిన కార్యక్రమాన్ని గతంలో ఎన్నడూ చూడలేదంటూ కితాబిచ్చారు.

విజయవంతం..

స్నాతకోత్సవం నిర్దేశించిన సమయానికి ప్రారంభమైంది. ఎలాంటి చిన్న తప్పిదం లేకుండా విజయవంతంగా ముగిసింది. బంగారు పతకాలు దక్కించుకున్న విద్యార్థులతో గవర్నర్ సరదాగా ముచ్చటించారు. ఆరు పతకాలు దక్కించుకున్న విద్యార్థి నంద్యాల పూజిత్ కుమార్ రెడ్డిని ఉద్దేశించి.. బంగారు పతకాలు చాలా బరువుగా ఉన్నాయంటూ సరదాగా వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్. కృష్ణయ్య, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

'బంగారు' కొండలు వీరే..



గవర్నర్ చేతులమీదుగా ఆరు బంగారు పతకాలు అందుకున్న నంద్యాల పూజిత్‌కుమార్ రెడ్డి

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

సమాజంలోకి అడుగుపెట్టాక కొత్త అనుభవాలు ఎదురవుతాయి. నేర్చుకున్న అంశాలను పరిశ్రమకు అనుసంధానం చేయాలి. భవిష్యత్తు సౌర, పవన విద్యుదుత్పత్తిదే. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి. –మాధవ్, ఐఐటీ కాన్పూర్ ఎమిరటస్ ప్రొఫెసర్

నాన్న కష్టాన్ని వృథా పోనివ్వను..

నాన్న బ్రహ్మానందా రెడ్డి కడప స్టీల్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ నన్ను చదివిస్తున్నారు. నా ఉన్నతి కోసం ఆయన పడుతున్న కష్టం వృథాగా పోనీరాదని, బాగా చదవాలని నిశ్చయించుకున్నా. ప్రొఫెసర్ కే. హేమ చంద్రా రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ కళ్యాణి రాధ, డాక్టర్ ఓం ప్రకాష్ మార్గదర్శకత్వంలో మంచి మార్కులు తెచ్చుకుని ఆరు గోల్డ్ మెడల్స్ సాధించా. – పూజిత్ కుమార్ రెడ్డి, వైఎస్సార్ జిల్లా



షేక్ సాజిద్ మురద్ (సివిల్)



దూదేకుల సబియా సుల్తానా(ఈఈఈ)



సయ్యద్ మహమ్మద్ అక్రమ్(మెకానికల్)



కె. వెంకట కార్తిక్ (ఈసీఈ)



ముచ్చెర్ల రాజు రమ్య లక్ష్మి(సీఎస్ఈ)



ఎన్ఎల్ చందన లక్ష్మి ప్రియ(ఐటీ)



సెట్లం అఖిల (ఫుడ్‌టెక్నాలజీ)



వెంకట నాగమణి (ఏఐ, డేటా సైన్స్)



భరత్ భవిత (సీఎస్ఈ)



చల్లా నాగేంద్రబాబు సీఎస్ఈ (డేటా సైన్స్)



హర్షిత, సీఎస్ఈ (ఏఐ, మెషిన్ లర్నింగ్)



అభినయన, సీఎస్ఈ (ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్)



పి. లిఖిత రెడ్డి (బీఫార్మసీ)



గోవుల వాల్మీకి హరిత (సివిల్)



పి. ఫయద్ అలీ (ఈఈఈ)



పి. వనిత (మెకానికల్)



వి. శ్రీ వైష్ణవి (ఈసీఈ)



టి. సుప్రజ (కంప్యూటర్ సైన్సెస్)



ఎం. జాహ్నవి కెమికల్ ఇంజినీరింగ్



వి. సునీత, ఎంటెక్ (స్ట్రక్చరల్ ఇంజినీరింగ్)



పి. అమృత బాబు (సివిల్)



పుల్లా భవ్యశ్రీ (ఈఈఈ)



వి. మహత మెకానికల్



ఓ.గ్లైసియా (ఈసీఈ)



ఎం. వాసంతి (సీఎస్ఈ)

- వైఎస్ జగన్‌ను ఇబ్బంది పెట్టేందుకు సీఎం చంద్రబాబు కుట్రలు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజల దృష్టి మరల్చేందుకే దొంగకేసులు

అనంతపురం కార్పొరేషన్: 'స్కిల్ స్కాంలో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయి జైలు పాలయ్యాడు. గత ఎన్నికలకు ముందు అలివిగాని హామీలతో అధికారంలోకి వచ్చాడు. ఏడాది గడుస్తున్నా ఒక్క హామీ నెరవేర్చలేదు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లింది. ఈ క్రమంలో ప్రజల దృష్టి మరల్చేందుకు దొంగ కేసులకు తెరలేపాడు' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎం చంద్రబాబు కుట్రపూరిత రాజకీయాలపై ఆయన ధ్వజమెత్తారు. భవిష్యత్తులో బీజేపీ, టీడీపీ, జనసేనలకు ప్రజలు అవకాశం ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఇటువంటి తరుణంలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని, ఆయనపై తప్పుడు కేసులు బనాయించేందుకే లిక్కర్ స్కాం అంటూ కక్ష సాధింపులకు తెరలేపారన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయ రెడ్డి, విశ్రాంత అధికారి కృష్ణమోహన్‌ను అందులో భాగంగానే అక్రమ అరెస్టు చేశారన్నారు. ఎవరెన్ని దొంగ కేసులు పెట్టినా.. ఎంత మందిని అరెస్టు చేసినా.. వైఎస్సార్ సీపీ ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమిస్తుందన్నారు. సూపర్ సిక్స్ హామీలపైనా, ప్రభుత్వ వైఫల్యాల పైనా ప్రజల్లో చర్చ మొదలైనప్పుడు, రాష్ట్రంలో ఏదో ఒక సమస్యను సృష్టించి, కాలయాపన చేయడం సీఎం చంద్రబాబుకు పరిపాటిగా మారిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపైనే కాకుండా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై కూడా తప్పుడు కేసులు నమోదు చేసి పోస్టింగ్‌లు ఇవ్వకుండా భయాందోళనకర వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు అక్షింతలు వేసినా ఎటువంటి మార్పు రావడం లేదన్నారు. రాష్ట్రంలో పరిస్థితులను గమనించి ఇతర రాష్ట్రాల వారు విస్తుపోతున్నారన్నారు. 'ఇక్కడ పని చేయలేం బాబోయ్' అంటూ ఐఏఎస్,



ఐపీఎస్ అధికారులు సెంట్రల్ సర్వీసులకు దరఖాస్తు చేసుకుంటున్న దారుణమైన పరిస్థితులను చంద్రబాబు తీసుకువచ్చారన్నారు.

మేలు చేయాలనుకోవడమే పాపమా?

పేదలు మద్యానికి బానిసలై జీవితాలను చిత్తు చేసుకోకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్యం పాలసీని అప్పటి సీఎం వైఎస్ జగన్ కఠినంగా అమలు చేశారని అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ప్రైవేట్ మాఫియా లేకుండా ప్రభుత్వమే నిర్వహించేలా చర్యలు తీసుకున్నారని, ప్రజలకు మేలు చేయాలని చూడడమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన పాపమా. అని ప్రశ్నించారు. మద్యం స్కాం అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చంద్రబాబు అండ్ కో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపిందని, ప్రైవేట్ వ్యక్తులకు మద్యం విక్రయాలను అప్పగించి, పర్మిట్ షాపులకంటే మూడింతలు బెల్ట్‌షాపులను ఏర్పాటు చేసుకుని విచ్చలవిడిగా మద్యంపై అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. ఇదీ అసలైన మద్యం స్కాం అంటూ ధ్వజమెత్తారు. జిల్లా కేంద్రంలోనే ఒక బాటిల్‌పై రూ.10 నుంచి రూ.40 వరకు వసూలు చేస్తున్నారని, తనతో వస్తే దీన్ని ఆధారాలతో నిరూపిస్తానన్నారు. ఇంత దారుణంగా మద్యం, ఇసుక, మట్టి ద్వారా రూ.కోట్లు కొల్లగొడుతుంటే దీన్ని స్కాం అనక ఇంకేమంటారు బాబూ అని ప్రశ్నించారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, కూటమి ప్రభుత్వానికి పుట్టగతుల్లేకుండా చేస్తారని ఆయన హెచ్చరించారు.

క్లుప్తంగా

వడదెబ్బతో కార్మికుడి మృతి


శ్రీనివాసులు (ఫైల్)

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని వాల్మీకి కాలనీకి చెందిన హమాలీ కార్మికుడు శ్రీనివాసులు (42) వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాలమేరకు... శ్రీనివాసులు ఉపాధి పనులతో పాటు హమాలీ యూనియన్‌లో కార్మిక సభ్యుడిగా ఉండి పనులు చేస్తూ జీవనం సాగించేవారన్నారు. శనివారం ఎండ వేడిమి భరించలేక శ్వాసకోశ సమస్యతో మొదట మండల కేంద్రంలోని ఆర్‌ఎంపీ వైద్యుని వద్ద ప్రథమ చికిత్సలు చేయించారని తెలిపారు. అనంతరం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడని పేర్కొన్నారు. మృతునికి భార్య రాధిక, ఇద్దరు కుమార్తెలున్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

- వ్యక్తికి తీవ్ర గాయాలు


రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

కళ్యాణదుర్గం రూరల్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినగా మరమ్మతు కోసం విద్యుత్ లైన్‌మెన్ పర్యవేక్షణలో అదే గ్రామానికి చెందిన వన్నూరప్ప అనే ప్రైవేట్ వ్యక్తిని పిలిపించారు. ఓ ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కించి మరమ్మతు చేస్తున్న సమయంలో వన్నూరప్పకు విద్యుత్‌షాక్ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ గూబనపల్లి ప్రజలు కళ్యాణదుర్గం విద్యుత్ ఆఫీసు ఎదుట నిరసన తెలిపారు. వన్నూరప్పకు న్యాయం చేస్తామని హామీ విద్యుత్ అధికారులు ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

ఆర్డీటీని కాపాడుకుందాం

- సేవ్ ఆర్డీటీ పేరుతో తలారి రంగయ్య ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలో భారీ బైకు ర్యాలీ
- తక్షణమే ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని నేతల డిమాండ్


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి


బైక్ ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలని నేతలు డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త, పీఏసీ సభ్యులు తలారి రంగయ్య ఆధ్వర్యంలో 'సేవ్ ఆర్డీటీ' పేరుతో శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బ్రహ్మసముద్రం మండల కేంద్రం నుంచి శెట్టూరు, కుందుర్పి, కంబదూరు మండలాల మీదుగా కళ్యాణదుర్గం వరకు ర్యాలీ జరిగింది.

బాబు, లోకేష్ పట్టించుకోలేదు

జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థకు ఫారిన్ కంట్రిబూషన్ రెగ్యులేషన్ (ఎఫ్‌సీఆర్‌ఏ) రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేయకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. ఆర్డీటీ ఆరోగ్యం, విద్య, క్రీడలు, భూగర్భ జలాల పెంపునకు వాటర్ షెడ్ల నిర్మాణం ఇలా ఎన్నో రకాల సేవలతో పేదలకు అండగా నిలిచిందన్నారు. గత ఎన్నికల సమయంలో ఎఫ్‌సీఆర్‌ఏను తాత్కాలికంగా రెన్యూవల్ చేశారని గుర్తు చేశారు. అప్పట్లో కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీ నేత, ఇప్పటి మంత్రి సత్యకుమార్, టీడీపీ నాయకులు వెళ్లి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల తర్వాత ఆర్డీటీ కష్టాలను పట్టించుకోవడం మానేశారన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ జిల్లాలో పర్యటించినా ఎక్కడా ఆర్డీటీకి భరోసా కలిగించేలా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

ప్రజలందరూ ఉద్యమించాలి

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య మాట్లాడుతూ ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయకపోవడంతో ఇప్పటికే ఆర్డీటీ సేవలు మందగించాయన్నారు. ఆర్డీటీని కాపాడుకోవాల్సిన అవసరం జిల్లా ప్రజలపై ఉందన్నారు. ఆర్డీటీ లబ్ధిదారులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. పేదలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసేందుకు కూటమి ప్రభుత్వమే ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయకుండా నిలుపుదల చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వాల మెడలు వంచైనా ఆర్డీటీ సేవలను పునరుద్ధరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ పేద ప్రజల బాగు కోసం అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ నాయకత్వంలో ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణకు పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. అనంతరం కళ్యాణదుర్గంలో మాజీ ఎంపీ తలారి రంగయ్య తదితరులతో కలిసి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ఆర్డీటీ సేవలు నిలిచిపోతే పేదల పరిస్థితి దారుణంగా తయారవుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు తిప్పేస్వామి, పేరం స్వర్ణలతారెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి ఆరె శ్యామల, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శులు చామలూరు రాజగోపాల్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణపురం వెంకటేశులు, జిల్లా ఉపాధ్యక్షులు కోనాపురం గంగాధరప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో సంక్షేమ విప్లవాన్ని తీసుకొచ్చారు. 11 నెలలు గడుస్తున్నా ఇచ్చిన ఏ ఒక్క హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చడం లేదు. జగనన్న నాయకత్వంలో ప్రజలకు చేసిన మేలును ప్రజలకు వివరిద్దాం' అని వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. శనివారం న్యూజిల్యాండ్‌లోని ఆక్లాండ్‌లో జరిగిన గ్లోబల్ కనెక్ట్ సమావేశానికి పెద్ద ఎత్తున ప్రవాసాంధ్రులు హాజరయ్యారు. ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలను ఆయుధాలుగా చేసుకుని జగనన్న చేసిన మేలును ప్రజల్లో తీసుకెళ్లాలన్నారు. అలాగే కూటమి కుట్రలు, వైఫల్యాలను తెలియజేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ న్యూజిల్యాండ్ కన్వీనర్ బుజ్జిబాబు, కో కన్వీనర్లు ఆనంద్ ఎద్దుల, సుమంత్ దేగపూడి తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాల ప్రచారమేంటి లోకేష్?

- జగనన్న తెచ్చిన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల

అనంతపురం కార్పొరేషన్: 'మంత్రి నారా లోకేష్ దావోస్‌లో ఒప్పందం చేసుకోవడం కారణంగానే జిల్లాకు సోలార్ ప్లాంట్, ఏపీ జెన్‌కో అండ్ ఎన్‌హెచ్‌పీసీ 950 మెగావాట్స్ హైడ్రా పవర్ ప్రాజెక్ట్ వచ్చాయని, కూటమి ప్రజాప్రతినిధులు చెప్పుకుంటున్నారు. ఈ అబద్ధాల ప్రచారమేంటి లోకేష్? గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ తీసుకొచ్చిన ప్రాజెక్టుకు ఇప్పుడు శంకుస్థాపన చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదు' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల విమర్శించారు. శనివారం ఆమె అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంధన రంగంలో జగనన్న అత్యుత్తమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. ఫలితంగా రూ.22,302 కోట్ల పెట్టుబడులు, 5,300 మందికి ఉద్యోగాలు వచ్చాయని గుర్తు చేశారు. రెన్యూవబుల్ ఎనర్జీకి గత ప్రభుత్వంలో నాంది పలికిన అంశానికి సంబంధించి పత్రికా కథనాలను చూపించారు. రెండ్రోజుల అనంత పర్యటనలో మంత్రి లోకేష్ ప్రజా సమస్యలపై ఎందుకు నోరుమెదపలేదో చెప్పాలన్నారు. ఇటీవల అనంతపురం జిల్లా కేంద్రంలోని కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఎలుకల వల్ల ఇబ్బంది పడ్డ విద్యార్థులను పరామర్శించిన పాపాన పోలేదన్నారు. కక్ష సాధింపులో భాగంగానే లిక్కర్ స్కాం పేరుతో విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, కృష్ణ మోహన్‌లను అరెస్టు చేశారన్నారు. దొంగ సాక్ష్యాలతో సంబంధం లేని వారిపై కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. మహిళలపై దౌర్జన్యాలు, బెదిరింపులు జరుగుతున్నా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏం చేస్తున్నారో చెప్పాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి, నాయకురాళ్లు సుజాత, ఉష, భారతి, దేవి, తదితరులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలకు వందనం


మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్


తిరంగా యాత్రలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు

'దేశం కోసం త్యాగాలు చేస్తున్న సైనికులకు వందనం.. వారికి బాసటగా నిలుద్దాం' అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వైద్యారోగ్య శాఖమంత్రి సత్యకుమార్, ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాల ధ్వంసమే లక్ష్యంగా భారత త్రివిధ దళాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతాన్ని పురస్కరించుకుని శనివారం సైనికులకు సంఘీభావంగా అనంతపురం నగరంలో 'తిరంగా యాత్ర'ను నిర్వహించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి నగర పాలక సంస్థ ఎదురుగా ఉన్న జాతీయ జెండా స్తంభం వరకు నిర్వహించిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వారు మాట్లాడుతూ దేశ ఔన్నత్యాన్ని కాపాడుకోవడానికి ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని మన సైనికులు ప్రపంచదేశాలకు తెలియజేశారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన సైనికుడు మురళీ నాయక్ వీరమరణం పొందారని, సైనికులకు అందరం రుణపడి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూర రెడ్డి, ఎంఎస్‌రాజు, మాజీ మంత్రి పల్లెరఘునాథ రెడ్డి, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, ఆర్‌డీఓ కేశవనాయుడు, సైనిక సంక్షేమాధికారి తిమ్మప్ప, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, ఎన్‌జీఓలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

ప్రతి గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేయండి

పెద్దపప్పూరు: ఎండ వేడిమికి గురికాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. శనివారం ఆయన స్వర్ణ ఆంధ్రా .. స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో బాగంగా పెద్దపప్పూరు ఆర్టీసీ బస్‌స్టాండ్ ఆవరణంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రతి గ్రామంలో పంచాయతీ అధికారులు తప్పనిసరిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఇంటా ఒక మొక్క నాటి సంరక్షించాలన్నారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభించి అవగహన ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఈఓ రామచంద్రారెడ్డి, డీపీఓ నాగరాజునాయుడు, ఎంపీడీఓ శంకుంతల, ఎంపీపీ వెంకటరామిరెడ్డి, సర్పంచు ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరులో రెచ్చిపోయిన జేసీ వర్గీయులు

- వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై దాడి


జేసీ వర్గీయుల దాడిలో ధ్వంసమైన కారు

సాక్షి టాస్క్‌ఫోర్స్: మండల కేంద్రమైన పెద్దవడుగూరులో శనివారం తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గీయులు రెచ్చిపోయారు. కొద్దిరోజులుగా పెద్దవడుగూరులోని శివప్రసాద్ ఇండియన్ గ్యాస్ గ్రామీణ వితరణ్ నిర్వహణ విషయంలో ఏజెన్సీ లైసెన్స్‌దారురాలు సరస్వతికి, నిర్వాహకుడైన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎద్దుల సూర్యప్రభాకర్‌రెడ్డికి విభేదాలు రావడంతో గ్యాస్ నిర్వహణ ఆగిపోయింది. ఏజెన్సీ తమకు స్వాధీనం చేసేలా సహకరించాలని జేసీపీఆర్‌ను సరస్వతి కోరారు. దీంతో ఆయన వారికి తోడుగా తన అనుచరులను గ్యాస్ గోదాము వద్దకు పంపారు. అక్కడ అడ్డుగా దారిలో ఉన్న రాళ్లు తీసివేస్తున్నారని బాటసారులు నిర్వాహకుడు సూర్యప్రభాకర్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన అక్కడికి కారులో వెళ్లారు. అప్పటికే ఏజెన్సీ వారు గ్యాస్ సిలిండర్లను ఐచర్ వాహనంలో తరలిస్తున్న దృశ్యాన్ని చూసి కిందకు దిగి ప్రశ్నించారు. అక్కడున్న వారు రెచ్చిపోవడంతో తన వాహనంలో భయంతో ఇంటికి వెనుతిరిగాడు. కొందరు వ్యక్తులు రెండు వాహనాల్లో ఆయన్ను వెంబడించారు. సూర్యప్రభాకర్‌రెడ్డి కారును బయట ఉంచి ఇంట్లోకి వెళ్లిపోగా.. కారును ధ్వంసం చేశారు. అక్కడితో ఆగిపోకుండా ఇంటి తలుపులు కూడా బద్దలు కొట్టడానికి ప్రయత్నించినట్లు బాధితుడు వాపోయారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇంటి వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అప్పటికే పెద్దవడుగూరుకు చేరుకొన్న జేసీపీఆర్.. తాడిపత్రి ట్రైనీ ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరిపై మండిపడ్డారు. సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున తాడిపత్రిలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి భౌతికదాడులు చేయించడం దారుణమని సూర్యప్రభాకర్‌రెడ్డి అన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


శివశంకర్‌రెడ్డి (ఫైల్)

పెద్దవడుగూరు: మండల పరిధిలోని రావులుడికి గ్రామంలో రైతు శివశంకర్‌రెడ్డి (56) అనే రైతు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు.. శివశంకర్‌రెడ్డి ఉదయాన్నే రైతులు పుల్లారెడ్డి, ప్రతాప్‌రెడ్డి లతో కలిసి తోట వద్దకు వెళ్లారు. మృతుడు తన పొలం వద్దకు వెళ్లాడు. నీటి తొట్టిలో నీళ్లు లేకపోవడంతో మోటర్ వద్దకు వెళ్లాడు. కరెంటు లేకపోవడంతో సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూడగా ఫీజు కట్ అయి ఉండటంతో ఫీజు వేసేందుకు యత్నించగా విద్యుదాఘాతంతో అక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులకు సంఘటనా స్థలానికి చేరుకొని కన్నీరు మున్నీరయ్యారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జమేదారు అన్వర్‌బాషా తెలిపారు.

22 నుంచి ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: వేసవి సెలవులు దృష్టిలో ఉంచుకొని తీర్థ యాత్రలకు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు ఐఆర్‌టీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్‌జీఎస్ కిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 13 వరకు మూడు ప్యాకేజీల కింద హైదరాబాద్ నుంచి రైళ్లు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఆయన తెలిపిన మేరకు.. ప్యాకేజ్–1 కింద ఈ నెల 22 నుంచి ప్రారంభమయ్యే యాత్ర 30వ తేదీ వరకు ఉంటుంది. అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజాపురం పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చు. ఒక్కొక్కరికి సాధారణ టికెట్టు రూ.14,700, 3–ఏసీ రూ.22,900, 2–ఏసీ రూ.29,900. సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, మధిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా రైలు ప్రయాణిస్తుందన్నారు.

ప్యాకేజీ–2(గంగా రామాయణ పుణ్యక్షేత్ర యాత్ర)

పుణ్యక్షేత్రాలు.. వారణాసి, అయోధ్య, నైమిశారణ్య, ప్రయాగరాజ్, శృంగవర్పూర్ క్షేత్రాలు. ఈ రైలు జూన్ 14న ప్రారంభమై 22వ తేదీ వరకు నడుస్తుంది. ఒక్కొక్కరికి సాధారణ టికెటు ధర రూ.16,200, 3– ఏసీ రూ.26,500, 2–ఏసీ రూ. 35,000. ఈ రైలు యాత్ర సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబుబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలాస, బరంపూర్, భువనేశ్వర్ మీదుగా ప్రయాణిస్తుంది.

ప్యాకేజీ–3(ఐదు జ్యోతిర్లింగ యాత్ర)

పుణ్యక్షేత్రాలు.. ఉజ్జయిని, మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీంశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మోష్, నాగ్పూర్. రైలు జూలై 5వ తేదీ ప్రారంభమై 13వ తేదీ వరకు నడుస్తుంది. సాధారణ టికెట్ ధర రూ.14,700, 3–ఏసీ రూ.22,900, 2–ఏసీ 29,900. రైలు సికింద్రాబాద్, కామారెడ్డి, నిజమాబాద్, ధర్మాబాద్, నాందేడ్, ముద్దడ్, పూర్ణ మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

- ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడంతోపాటు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయం ఉంటుంది. ఇతర వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 9701360701, 9281030712, 9281030749, 9281030750.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కార్పొరేషన్: జిల్లా వైద్య విధాన పరిషత్ పరిధిలో 43 పారామెడికల్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానించినట్లు డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ తెలిపారు. ఈ నెల 21 నుంచి 28వ తేదీలోపు డీసీహెచ్ఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. బయో మెడికల్ ఇంజినీర్, రేడియోగ్రాఫర్, ల్యాబ్ టెక్నీషియన్స్, ఆడియోమెట్రిక్, ఫిజియోథెరపిస్టు, ఓటీ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, అటెండర్, ల్యాబ్ అటెండెంట్ తదితర పోస్టులు ఉన్నాయన్నారు.

మురికి కాలువగా జీఎస్‌బీసీ

గుంతకల్లు: గుత్తి ఉప కాలవ మురికి కాలవగా మారింది. తుంగభద్ర ఎగువ కాలవలో భాగమైన గుత్తి ఉప కాలవ (జీఎస్‌బీసీ) గుంతకల్లు పట్టణం మీదుగా వెళ్తోంది. దాదాపు రూ.15 లక్షలతో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు తొలగింపు పనులు చేపట్టినా సంబంధిత కాంట్రాక్ట్ ముళ్లపొదలను తొలగించి కాలవ పక్కన పడివేయడంతో జీఎస్‌బీసీ మరింత అధ్వానంగా తయారైంది.



క్లుప్తంగా

రక్తపోటును నిర్లక్ష్యం చేయొద్దు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: రక్తపోటును నిర్లక్ష్యం చేస్తే ప్రాణం మీదకు వస్తుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. శనివారం ప్రపంచ అధిక రక్తపోటు దినాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకూ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. రక్తపోటు సైలెంట్ కిల్లర్ అన్నారు. రక్తపోటును విస్మరిస్తే తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం లేకపోలేదన్నారు. ధూమపానం, మద్యపానం, తదితర వ్యసనాల జోలికి వెళ్లకూడదన్నారు. రోజూ వ్యాయామం, యోగా తదితర శారీరక శ్రమపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ యుగంధర్, డాక్టర్ అనుపమ జేమ్స్, డాక్టర్ నారాయణ స్వామి, ఓబులు, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌తో మేయర్ భేటీ


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మేయర్ వసీం

అనంతపురం టవర్‌క్లాక్: జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం అనంతపురం విచ్చేశారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గవర్నర్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్: జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రానికి విచ్చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మేయర్ వసీం శనివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు మేయర్ వసీం పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి


శ్యామలకు పూలమొక్క అందజేస్తున్న డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య

అనంతపురం కార్పొరేషన్: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామలను డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్యామలకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. శ్యామల మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలన్నారు.

జీఓ 77 రద్దుకు రెడ్‌బుక్ ఓపెన్ చేయండి


మాట్లాడుతున్న కె.భాస్కర్

అనంతపురం ఎడ్యుకేషన్: 'పీజీ విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ దూరం చేసే జీఓ నంబర్ 77ను రద్దు చేస్తానని ఎన్నికల ముందు నారా లోకేష్ రెడ్‌బుక్‌లో రాసుకున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా నేటికీ పట్టించుకోలేదు. ఆ రెడ్ బుక్‌ను ఓపెన్ చేసి ఆ హామీని అమలు చేయండి లోకేష్ గారు అని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఉమేష్‌నాయక్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో భాస్కర్‌తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్ మాట్లాడారు. విశ్వ విద్యాలయాల్లో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయకుండా ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ. 3,500 కోట్ల ఫీజు బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం తక్షణమే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, కోశాధికారి బండారి శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉదయ్, శశి, వినోద్, నవీన్, తేజ పాల్గొన్నారు.

మ్యూజియం.. చరిత్రకు సాక్ష్యం

- పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు మ్యూజియంలో ఆకట్టుకుంటున్న పురాతన వస్తువులు
- అందుబాటులో అరుదైన కళాఖండాలు, కత్తులు, మట్టి బొమ్మలు
- మ్యూజియం సందర్శించే చిన్నారులకు నేడు ఉచిత ప్రవేశం



అనంతపురంలోని మ్యూజియం

అనంతపురం కల్చరల్: అన్ని కాలాలకు చెందిన ప్రతి యుగం నాటి వస్తువులు ఆసక్తికరమైన జిల్లా చరిత్రను చెబుతూ అనంత పురావస్తు శాఖ భవనంలో కొలువుదీరాయి. వివిధ తవ్వకాల్లో లభించిన ఆనాటి రాతి యుగం నుంచి ఆధునిక కాలం వరకు వివిధ రాజవంశాలకు చెందిన పనిముట్లు, వాడిన కత్తులు, కటారులు, ఉపయోగించిన వస్తువులు అందరినీ అమితంగా ఆకర్షిస్తాయి. కేవలం శిలలు, శిల్పాలు, శాసనాలే కాకుండా మట్టిబొమ్మలు బౌద్ధ, జైన రాతి కాంస్య ప్రతిమలు, వివిధ రాజవంశాలకు చెందిన అపురూప వస్తువులు 'అనంత' చరిత్రకు దర్పణం పడుతున్నాయి. చరిత్ర ప్రాధాన్యతను వివరించే క్రమంలో ఏటా మే 18న 'మ్యూజియం డే' జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో నిర్మాణమైన పురావస్తు భవంతిలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వేసవి సెలవుల్లో ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మ్యూజియం అధికారులు సూచిస్తున్నారు.

విజ్ఞాన వినోదాల మేళవింపు

పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు మ్యూజియం పేరిట జిల్లా కేంద్రంలో రూపుదిద్దుకున్న మ్యూజియంలో అనంత సంస్కృతి, వారసత్వ సంపద, చరిత్రను కళ్లకు కడుతూ ఏర్పాటైంది. వివిధ రాజవంశాల చరిత్రను ఘనంగా ప్రతిబింబించేలా వినూత్నమైన రీతిలో విజ్ఞాన వినోదాల మేళవింపుగా అధునాతన మ్యూజియం తయారైంది. స్థానిక ఆదిమూర్తి నగర్‌లో రెండేళ్ల కిందట ఏర్పాటైన మ్యూజియంలో ఇంటరాక్టివ్ డిస్‌ప్లే, టచ్ స్క్రీన్ ద్వారా జిల్లాలోని ప్రసిద్ధ క్షేత్రాల విశేషాలు, చారిత్రాత్మక స్థలాలు, జైన, బౌద్ధ అవశేషాలను తిలకించే ఏర్పాటుతో పాటూ దాదాపు 1,000 వస్తువులు ఇందులో పొందుపరిచారు. ముఖ్యంగా మూడు అంతస్తుల్లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన వాటిల్లో వేల ఏళ్ల నాటి పనిముట్లు, మట్టి బొమ్మలు, అజంతా, చుగ్‌తాయ్, డెక్కన్, రాజస్థానీల ఆధునిక చిత్రలేఖనాలు, బంగారు, వెండి నాణేలు, కవచాలు, పిస్టల్స్, కత్తులు, డాళ్లు, ఫిరంగులు చూసే అవకాశం కల్పించారు.

మ్యూజియంలోని పురాతన వస్తువులు


ఆదిమానవుడి జీవిత విశేషాలు


బంగారు నాణెం


ద్రవిడ భాషలోని శాసనం


వర్ధమాన మహావీరుడి ప్రతిమ

వారసత్వాన్ని కొనసాగించాలి



అనంత చరిత్రకు ప్రతిబింబంగా నిర్మించిన మ్యూజియం హాలులో ఆదివారం మ్యూజియం దినోత్సవం నిర్వహిస్తాం. ఘనమైన చరిత్ర కలిగిన 'అనంత' ప్రత్యేకతను చాటేలా ఏర్పాటైన మ్యూజియంను విద్యార్థులు సందర్శించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. వేసవి సెలవుల్లో ఈ అద్భుతమైన కట్టడాన్ని తిలకించేందుకు చిన్నారులకు ఉచిత ప్రవేశ సౌకర్యం కల్పించాం. చరిత్ర ప్రేమికులు, కవులు, రచయితలందరూ భాగస్వాములు కావాలి.

– రజిత, సహాయ సంచాలకులు, జిల్లా పురావస్తుశాఖ

రాష్ట్రంలో అరాచక పాలన

- మేయర్ వసీం



అనంతపురం కార్పొరేషన్: 'కక్ష సాధింపులే పరమావధిగా కూటమి ప్రభుత్వం నడుచుకుంటోంది. రాష్ట్రంలో అరాచక పాలనకు సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ తెరదీశారు. ప్రజలన్నీ గమనిస్తున్నారు.. రానున్న రోజుల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారు' అని మేయర్ వసీం పేర్కొన్నారు. మాజీ ఐఏఎస్ ధనుంజయ రెడ్డి, ప్రభుత్వాధికారి కృష్ణమోహన్ అరెస్టును ఖండిస్తూ శనివారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. ఇలాగైతే రాష్ట్రంలో ఏవిధంగా పాలన సాగుతుందన్నారు. ఎటువంటి తప్పిదాలు చేయకున్నా.. అక్రమంగా అరెస్టు చేయడం తగదన్నారు. సూపర్ సిక్స్ హామీల నుఇంత వరకు పక్కాగా అమలు చేయలేదన్నారు. సీఎం చంద్రబాబు కాలం వెల్లదీయడం, కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం పరిపాటిగా మారిపోయిందన్నారు. ఎన్నికలకు ముందు చెప్పిన విధంగానే రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

టీడీపీ కార్యకర్త దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న ముత్యాలప్ప

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం నరసనాయనికుంట ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న బి.ముత్యాలప్పపై ఆయన బంధువు, టీడీపీ కార్యకర్త తిరుపాలు కట్టెతో దాడి చేయడంతో కాలు విరిగింది. బాధితుడు సర్వజన ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతున్నాడు. ఈనెల 13న జరిగిన దాడి ఘటనకు సంబంధించి బాధితుడు ముత్యాలప్ప, ఆయన కుటుంబ సభ్యుల వివరాల మేరకు... ముత్యాలప్పకు ఇద్దరు సోదరులున్నారు. వీరి ముగ్గురికి కలిపి 12 ఎకరాల భూమి ఉంది. ఎవరికి వారు భాగపరిష్కారాలు చేసుకున్నారు. పెద్దవాడు అయిన ముత్యాలప్ప తన భాగానికి వచ్చిన ఆస్తిని విక్రయానికి పెట్టాడు. ఇటీవల ముత్యాలప్ప సోదరుడి అల్లుడు, టీడీపీ కార్యకర్త తిరుపాలు కలగజేసుకుని మధ్యవర్తిగా ఉంటూ కొనుగోలుదారుడిని పిలిపించాడు. ముత్యాలప్ప చెప్పిన ధరకంటే చాలా తక్కువకు అడగడంతో అమ్మేందుకు ముత్యాలప్ప, ఆయన కుమారులు ఒప్పుకోలేదు. అప్పటి నుంచి తిరుపాలు కోపంతో రగలిపోతున్నాడు. ఈనెల 13న రాత్రి 7 గంటల సమయంలో ముత్యాలప్ప కుమారుడు, ఆయన తమ్ముడి కుమారుడు కలిసి భూమి అమ్మకం విషయమై మాట్లాడుకుంటుండగా... అక్కడికి వచ్చిన తిరుపాలు కట్టెతో దాడి చేశాడు. ఈ దాడిలో ముత్యాలప్ప కుడి కాలు విరిగి తీవ్రగాయమైంది. 108 సకాలంలో రాకపోవడంతో అందుబాటులో ఉన్న ఆటోను పిలవగా... వెళ్లకూడదంటూ ఆటో డ్రైవర్‌ను తిరుపాలు బెదిరించాడు. అప్పటికే సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని ఆటోలో పంపేలా చర్యలు తీసుకున్నారు. సర్వజన ఆస్పత్రిలో ముత్యాలప్ప చికిత్స పొందుతున్నాడు. దాడి ఘటనపై రూరల్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

వామ్మో ఇదేం కంపు!


వాసన భరించలేక ముక్కు మూసుకుని నీటి శాంపిల్ తీసుకుంటున్న పీసీబీ ఉద్యోగులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ పరిధి బళ్లారి రోడ్డు సమీపంలో ఉన్న సిప్లాన్ గ్రగ్స్ ఫ్యాక్టరీ నుంచి భూమిలోకి వదులుతున్న వ్యర్థాలు ఎంత ప్రమాదకరంగా మారాయో... శనివారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (కాలుష్య నియంత్రణ మండలి) ఉద్యోగులు ప్రత్యక్షంగా చూశారు. ఈనెల 13న 'సాక్షి'లో 'సిప్లాన్ భూతం' శీర్షికన ప్రత్యేక కథనం వెలువడింది. దుమారం రేపిన ఈ కథనంపై ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో ఇద్దరు ఉద్యోగులు వచ్చి నీటి శాంపిల్స్ సేకరించారు. 'సిప్లాన్'కు ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న చెక్‌డ్యాంలోని పంచాయతీ బోరు వద్దకు సర్పంచ్ బండా అంజియాదవ్, పంచాయతీ సిబ్బంది సహకారంతో పీసీబీ ఉద్యోగులు ముందుగా చేరుకున్నారు. బాటిల్‌లో నీటి శాంపిల్ తీసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి 'సిప్లాన్'కు 500 మీటర్ల దూరంలో నిర్మాణంలో ఉన్న 'గ్లాసెస్ వెలివేషన్ తయారీ ఫ్యాక్టరీ' వద్దకు చేరుకున్నారు. ఇక్కడి బోరు ఆన్ చేయగానే నీరు బయటకు వచ్చిన సెకన్లలోనే భరించలేని దుర్వాసన వచ్చింది. ఆ నీటిని శాంపిల్ తీసుకోవడానికి కూడా వారు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఒక ఉద్యోగి ఆ వాసన భరించలేక వాంతి చేసుకున్నారు.

రోజూ ట్యాంకర్లతో నీరు కొనుగోలు

బెంగళూరుకు చెందిన వారు స్థలాన్ని అద్దెకు తీసుకుని 'గ్లాసెస్ వెలివేషన్ తయారీ ఫ్యాక్టరీ' నిర్మిస్తున్నారు. నిర్మాణ పనుల కోసం 8 నెలల క్రితం బోరు వేయించారు. బోరు వేసిన సమయంలోనే పెద్ద ఎత్తున దుర్వాసన వెదజల్లింది. ఈ క్రమంలో ఆ నీటిని నిర్మాణానికి కూడా వాడుకునే సాహసం చేయలేక రోజూ ట్యాంకరు నీటి చొప్పున నాలుగు నెలల పాటు ప్రైవేటుగా కొనుగోలు చేశారంటే ఆ నీరు ఏస్థాయిలో కలుషితమవుతోందో అర్థం చేసుకోవచ్చు.

ఎస్సీ వర్గీకరణలో సమన్యాయం చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ వర్గీకరణలో మాదిగ, మాలలకు సమన్యాయం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగుల వెంకటేశ్వరరావు కోరారు. శనివారం స్థానిక ఎన్జీఓ హోంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం 33 సంవత్సరాలుగా మాదిగలు పోరాటం చేశారన్నారు. ఎంతో మంది ప్రాణ త్యాగం చేసినట్లు గుర్తు చేశారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. వర్గీకరణలో వాటాల విషయంలో మాదిగలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. మాదిగలకు 6 శాతం, మాలలకు 8 శాతం కేటాయిస్తే.. మాదిగలకు తీరని అన్యాయం చేసిన వారు అవుతారన్నారు. ఏడున్నర శాతం జనాభా ఉన్న మాలలకు 8 శాతం రిజర్వేషన్ కల్పించి.. ఆరున్నర శాతం జనాభా ఉన్న మాదిగలకు 6 శాతం కేటాయించడం దారుణమని మండిపడ్డారు. రాష్ట్రంలో అత్యధికంగా మాదిగలు ఉన్నారని తెలిపారు. ఓట్ల కోసం రిజర్వేషన్లలో తేడాలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమన్యాయం పాటిస్తే అక్కడ అడ్డంకులు ఎవరు సృష్టించారో అందరికీ తెలుసన్నారు. మందకృష్ణ మాదిగ డబ్బుకు అమ్ముడుపోయి మాదిగలకు నష్టం చేస్తున్నారని ఆరోపించారు. సమన్యాయం కోసం పోరాడతామన్నారు. చంద్రబాబు నాయుడు వర్గీకరణపై పునరాలోచించాలన్నారు. కార్యక్రమంలో కుంటిమద్ది ఓబులేసు, ఆదిశేషు, రామాంజనేయులు, మద్దిలేటి, గంగిశెట్టి ఓబులేసు, రామంజప్ప తదితరులు పాల్గొన్నారు.

'రక్త చరిత్రను ప్రజలు హర్షించరు'


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రా రెడ్డి


చిగిచెర్ల నారాయణ రెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న తోపుదుర్తి కవిత

రాప్తాడు: రాప్తాడులో పొలంలో తగాదాలో వ్యక్తులను హతమార్చడం దుర్మార్గమైన చర్య. మళ్లీ పుంజుకుంటున్న రక్త చరిత్రను ప్రజలు హర్షించరని వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రా రెడ్డి అన్నారు. శనివారం ఆయన పొలం తగాదాలో టీడీపీ నాయకుల దాడిలో దారుణ హత్యకు గురై మృతి చెందిన చిగిచెర్ల నారాయణ రెడ్డి, చిగిచెర్ల ముత్యాలమ్మ మృతదేహాలను సందర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయన్నారు. పోలీసులు పని చేయకపోవడంతోనే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. నారాయణ రెడ్డి ఉదయం తోటలోకి వెళ్లే ముందు తనకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని తెలిపారు. పోలీసులు నిజాయితీగా పని చేస్తే హత్యలు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థ కూడా నేరస్తులకు అండగా నిలవడం సిగ్గుచేటని మండిపడ్డారు. నియోజకవర్గంలో టీడీపీ నాయకులు మరో రక్త చరిత్రను సృష్టించాలని చూస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే ప్రజా తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఇలాంటి దాడులు, దౌర్జన్యాలను ప్రతిఘటిస్తామన్నారు. అంతకు ముందు మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తోపుదుర్తి కవిత, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మరూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు రాజా రెడ్డి, ఎస్‌కేయూ లింగారెడ్డి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మృతదేహాలను సందర్శించారు.

కోర్టు రికార్డులు సక్రమంగా భద్రపర్చాలి


కోర్టు గదులను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు, ఏడీజే శైలజ

హిందూపురం: వివిధ కేసులకు సంబంధించి కోర్టు రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు సూచించారు. కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరిన నేపథ్యంలోనే ఇటీవలే పాత న్యాయస్థాన సముదాయంలోని కోర్టులను పశుసంవర్ధక కార్యాలయంలోకి మార్చారు. ఈ నేపథ్యంలో శనివారం జిల్లా జడ్జి భీమారావు, అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజతో కలిసి నూతన కోర్టు భవన సముదాయాలను పరిశీలించారు. ఈ సందర్భంలోనే జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో రికార్డులు అస్తవ్యస్తంగా ఉండటాన్ని చూసి జిల్లా జడ్జి విస్మయం వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణలో అశ్రద్ధ పనికిరాదన్నారు. అనంతరం అదనపు జిల్లా జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానాలు, ప్రత్యేక న్యాయస్థానం, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయ స్థానాలతోపాటు జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి, కార్యాలయ గదులు, న్యాయమూర్తుల గదులను పరిశీలించారు. అలాగే న్యాయస్థానం, క్లరికల్ విభాగం, రికార్డుల గది, స్టేనో విభాగం, కాపీ సెక్షన్, లోక్ అదాలత్ తదితర విభాగాలన్నీ చూశారు. కోర్టుల నిర్వహణ, పాత భవనాలను కూల్చివేత తదితర అంశాలపై అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మిహారిక, ప్రత్యేక మెజిస్ట్రేట్ రమణయ్య పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

అనంతపురం రూరల్: పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యత కలిగి ఉండాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ అన్నారు. శనివారం ఏ.నారాయణపురం పంచాయతీలో స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మన ఇంటిని శుభ్రంగా ఉంచుకుంటే వీధి బాగుంటుందని.. వీధి బాగుంటే ఊరు బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, ఈఓఆర్డీ వెంకటనాయుడు, స్పెషలాఫీసర్ సురేష్, కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, సంరక్షించాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలని తహసీల్దార్ లక్ష్మీనాయక్ తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో కలసి స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగభూషణం, వీఆర్వోలు శ్రీలక్ష్మి, ప్రసాద్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయ సంఘాల సన్నాహక సమావేశం

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యారంగ సంస్కరణల పేరుతో ప్రభుత్వం విద్యారంగాన్ని బలహీన పరచడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 21 రాష్ట్ర వ్యాప్తంగా డీఈఓ కార్యాలయాల ముట్టడికి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం స్థానిక డీఈఓ కార్యాలయంలో ఏపీ వైఎస్సార్‌టీఏ, ఆప్టా సంఘాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల నుంచి ప్రతినిధులు హాజరు కావాలని వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి, ఆప్టా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటరత్నం విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 19, 20, 21 జీఓలు అసంబద్ధంగా ఉన్నాయని, పాఠశాలల మనుగడకు ముప్పు వాటిల్లుతోందన్నారు. ఆ జీఓలను వ్యతిరేకిస్తూ 16 డిమాండ్లతో విద్యాశాఖకు రాష్ట్ర ఉపాధ్యాయ ఐక్య వేదిక నోటీసు ఇచ్చిందని గుర్తు చేశారు. 21న ఉమ్మడి జిల్లా డీఈఓ కార్యాలయాల ముట్టడి, 23న విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాలు నిర్ణయించిందన్నారు. ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు ఉపాధ్యాయ భవన్‌లో సన్నాహక సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మార్కెట్‌లోకి 'కియా కారెన్స్ క్లావిస్'


కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: స్థానిక ఎంజీ బ్రదర్స్ కియా షోరూంలో శనివారం కారెన్స్ క్లావిస్ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. డిజైన్ పరంగా స్మార్ట్ ఫ్యామిలీ కారు అని.. సౌకర్యవంతంగా ఉంటుందని కంపెనీ ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో షోరూం సీఈఓ ఆదిత్య మాచాని, మేనేజర్స్ ఎల్లప్ప, గిరి ప్రసాద్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు వాల్మీకి ప్రతిభా పురస్కారాల పంపిణీ

అనంతపురం ఎడ్యుకేషన్: ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చాటిన వాల్మీకి/బోయ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ఈనెల 19న ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆర్సీ అక్కులప్ప, ప్రధాన కార్యదర్శి ఎ.చైతన్యకుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రుద్రంపేట బైపాస్ పక్కన వాల్మీకి కల్యాణ మంటపంలో పురస్కారాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అర్హులైన, నిర్ణీత గడువులోగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ముందుగా ఆయా విద్యార్థులు, తల్లిదండ్రులకు సమాచారం అందజేస్తామన్నారు. సమాచారం అందిన ప్రతి విద్యార్థితో పాటు తల్లిదండ్రులు, జిల్లా వ్యాప్తంగా వాల్మీకి ఉద్యోగులు, కులస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో ప్రతిభ


బంగారు పతకం అందుకుంటున్న చిన్నారి నిహాన్సా రెడ్డి

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన నికితేష్ రెడ్డి, సంధ్య దంపతుల కుమార్తె నిహాన్సారెడ్డి జాతీయ స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీల్లో రాణించి మైసూరు పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంది. శనివారం మైసూరులో ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ మాట్లాడుతూ.. సకల సమస్యల పరిష్కారమార్గమైన ఉత్తమ వ్యక్తిత్వ వికాస గ్రంథం భగవద్గీతను అనంత వాసులు అలవోకగా కంఠస్థం చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం చిన్నారికి పతకంతో పాటూ ప్రశంసాపత్రాన్ని అందించి ఆశీర్వదించారు. అదేవిధంగా పోటీల్లో ఉత్తమ ప్రతిభతో ఎంపికైన అనంత వాసులు సీహెచ్ విశ్వేశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డి, అనురాధ తదితరులకు ఆదివారం స్వామీజీ బంగారు పతకాలు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్ క్లయిమ్‌లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా 5వ మహాసభలకు సంబంధించి డిమాండ్లతో కూడిన కరపత్రాలను శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 8వ తేదీన భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలు నిర్వహించనున్నామన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. సంక్షేమ బోర్డును పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని కోరారు. 50 ఏళ్ల వయస్సు దాటిన ప్రతి భవన కార్మికుడికి పింఛను ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలపై మహాసభలో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మహాసభలకు భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు రామాంజి, లక్ష్మన్న, శ్రీరాములు, శ్రీరామ్, ఉలిగప్ప, తదితరులు పాల్గొన్నారు.